సాక్షి
మెదక్
బుధవారం ı 28 ı ఫిబ్రవరి ı 2024

ముస్తాబైన బగలాముఖి శక్తిపీఠం



న్యూస్‌రీల్

పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం

- పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీహరి



మెదక్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీహరి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల నుంచి దఖాస్తులను స్వీకరించేందుకు పోస్టల్ సిబ్బంది గ్రామాల్లోకి వస్తున్నారని, అవసరమైన వారు సిబ్బందికి వివరాలు తెలపాలని కోరారు. నెలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందాలంటే 1-2 కేవీ సోలార్ ప్యానల్‌ను ఇంటిపైన లేదా ఖాళీస్థలంలో అమర్చుకోవాలని, ఇందుకోసం రూ.30 వేల సబ్సిడీ ఇస్తారని చెప్పారు. అలాగే 150-300 యూనిట్ల విద్యుత్ వాడకం ఉంటే 2-3 కేవీ విద్యుత్ సోలార్ ప్యానల్‌ను బిగించుకోవాలని, అందుకోసం రూ.60వేల వరకు సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 300 యూనిట్ల కంటే ఎక్కువ అవసరం ఉంటే 3 కేవీ, సోలార్ ప్యానల్‌బోర్డును అమర్చుకోవాలని చెప్పారు. అవసరమైన వారు పోస్టల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

టీఎస్‌ఎస్సీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: టీఎస్‌ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్, వసతి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలైన బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ ఇతర పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులకు 5 నెలల ఫౌండేషన్ కోర్స్ నిమిత్తం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 100 మంది అభ్యర్థులకు మాత్రమే ప్రవేశ అవకాశం ఉంటుందని తెలిపారు. మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు మార్చి 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెదక్ నుంచి హైదరాబాద్‌కు రైళ్లను పెంచాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ కలెక్టరేట్: మెదక్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రభుత్వం రైళ్ల రాకపోకలను కూడా పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ మెదక్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా నిధులు కేటాయిస్తూ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారన్నారు. రూ.15.31 కోట్లతో చేపట్టే మౌలిక వసతుల పనులను వర్చువల్ విధానంలో ప్రారంభించినట్లు తెలిపారు. కేటాయించిన ఈ నిధులను రైల్వేస్టేషన్లకే ఖర్చు పెట్టే విధంగా చూడాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతో వ్యవసాయం, పారిశ్రామిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, అలాగే మెదక్ నుంచి హైదరాబాద్‌కు రైళ్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.బసవరాజు, కె.మల్లేశం, కె.నర్సమ్మ, కార్యవర్గ సభ్యులు కడారి నాగరాజు, సంతోష్, సర్దార్, డి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీతో అన్యాయం

- డైట్ విద్యార్థుల నిరసన



ధర్నా చేస్తున్న డైట్ విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీని తాత్కాలికంగా వాయిదావేసి డైట్ విద్యార్థులకు టెట్ పరీక్షలు నిర్వహించాలని డైట్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీని వాయిదా వేయకపోతే తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. ప్రస్తుత డైట్ విద్యార్థులకు టెట్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. డైట్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శేషుతో పాటు డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తిపీఠం శోభాయమానం

స్థానిక బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవానికి ముస్తాబైంది. 28, 29 తేదీల్లో వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్టు ఆలయ పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్):

ఆరుతడి.. కంటతడి

రోజురోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలు రైతుల గుండెల్లో అలజడి రేపుతున్నాయి. దీంతో బోరుబావులపై వరిసాగు చేసిన అన్నదాతల ఆశలు అడియాసలు అవుతున్నాయి.

మెదక్:

ఎండుతున్న మడులు
- అడుగంటున్న భూగర్భ జలాలు
- బోరుబావుల్లో తగ్గిన నీటిఊటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



బోరు ఆధారంగా సాగై ఎండిపోతున్న వరి

భూగర్భ జిల్లాలు రోజురోజుకు వేగంగా పడిపోతున్నాయి. గతేడాది జనవరిలో ఓవరాల్‌గా జిల్లాలో 10.46 మీటర్ల లోతుకు పడిపోగా ఈ ఏడాది జనవరిలో 11.46 మీటర్ల లోతుకు పడిపోయింది. ఈ లెక్కన గతేడాదితో పోల్చితే 1.66 మీటర్ల లోతులోకి పడిపోయాయి. దీంతో బోరుబావుల్లో నీటి ఊటలు తగ్గిపోయి పంటలకు నీటి తడులు అందక పోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. ఫలితంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 2,73,128 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకాగా అందులో 2,60,933 ఎకరాల్లో వరి సాగుచేశారు. మిగతా 12,195 ఎకరాలలో ఆరుతడి పంటలు వేశారు. అందులో సుమారు 50వేల ఎకరాలలో మాత్రమే ఘణాపూర్ ప్రాజెక్టుతో పాటు హల్దీవాగు ప్రాజెక్టు ఆధారంగా సాగు చేయగా మిగతావాటికి బోరుబావులే ఆధారం. వరి పంటకు మరో రెండు మాసాల వరకు నీటితడులు అందిచాల్సి ఉంది. కాని ఇప్పుడే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో మరో రెండు మాసాలు నీటి తడులు ఎలా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలవ్యవధిలో 1.66 మీటర్లకు..

2023 డిశంబర్‌లో 9.8మీటర్ల డెప్త్‌లో నీటి ఊటలు ఉండగా.. 2024 జనవరికి 11.46 మీటర్లకు పడిపోయింది. ఈ లెక్కన నెలరోజుల తేడాతో 1.66 మీటర్ల లోతుకు చేరింది. పదేళ్లలో భూగర్భ జలాలు ఇంత వేగంగా పడిపోవడం ఇదే మొదటిసారి అని అధికారులు చెబుతున్నారు.

10 నుంచి 20 మీటర్లలోతుకు

జిల్లా వ్యాప్తంగా 14మండలాల పరిధిలో భూగర్భ జలాలు 10 నుంచి 20 మీటర్ల లోతుకు చేరాయి. చిలప్‌చెడ్, అల్లాదుర్గ్, చిన్నశంకరంపేట, రేగోడు, మెదక్, కొల్చారం, నార్సింగ్, మాసాయిపేట, వెల్దుర్తి, కౌడిపల్లి, పెద్దశంకరంపేట, నిజాంపేట, నర్సాపూర్ లాంటి మండలాల పరిధిలో 1.25 లక్షల ఎకరాలలో వరి పంట సాగులో ఉంది. ఆ సాగుకు పూర్తిగా బోరుబావులే ఆధారం. భూగర్భ జలాలు అడుగంటుతున్న ఈ నేపథ్యంలో ఆ పంటలు పండుతాయా, లేక ఎండుతాయోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

సాగుతక్కువే..

2023లో యాసంగితో పోల్చితే ఈసారి సాగు తక్కువగానే ఉంది. గతేడాది 2,78, 579 ఎకరాలలో అన్నిరకాల పంటలను సాగు చేయగా ఈ సంవత్సరం 2,73,128 ఎకరాలలో సాగు చేశారు. గతేడాదితో పోల్చితే 5,451 ఎకరాల పంట తక్కువగా సాగైనట్టే. అయినప్పటికీ భూగర్భజలాలు వేగంగా పడిపోతూ పంటలకు నీటి తడులు అందక పోవడంపై ఆవేదన వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది వానలు ఎక్కువే..

2022 వానాకాలంతో పోల్చితే 2023లో వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. అయినప్పటికీ ఈ ఏడు భూగర్భజలాలు గతేడాది కన్నా గణనీయంగా పడిపోయాయి. 2022 వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1129.4 మిల్లీమీటర్లు నమోదు కాగా 2023లో 1288.7 మిల్లీమీటర్లు నమోదైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన 159.3 మిల్లీమీటర్లు అధికంగా వర్షం కురిసింది. అయినప్పటికీ భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి.

సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ టీం, నోడల్ అధికారులకు పవర్ పాయింట్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ తూప్రాన్ ఆర్డీఓ జయచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గత ఎన్నికలలో అనుభవాలను పరిగణలోకి తీసుకుని రానున్న లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలలో ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీమ్(ఎఫ్‌ఎస్‌టీ), స్టాటస్టిక్ సర్వైలెన్స్ టీమ్(ఎస్‌ఎస్‌టీ), వీడియో సర్వైలెన్స్ టీమ్(వీఎస్‌టీ), వీడియో వ్యూవింగ్ టీమ్(వీవీటీ) వివిధ టీమ్‌ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహనతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను మంగళవారం మెదక్‌లో నిర్వహించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి 2కే పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సాధ్యంకాని హామీలతో మోసం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- రు.2లక్షల రుణమాఫీ భూటకం
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

మెదక్/రామాయంపేట(మెదక్): ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి కూడా పడుతుందని, ఒకేసారి రు.2 లక్షల రుణమాఫీ చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సవాల్ చేశారు. మంగళవారం విజయ సంకల్ప యాత్ర జిల్లాలో ప్రవేశించిన సందర్భంగా రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోస గించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారని, ఈయన కూడా అబద్ధాలు చెపుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పూవుకే ఓటువేసి మోదీని మళ్లీ ఒకసారి ప్రధానిగా చూడాలని ఆయన ఆకాంక్షించారు. రూ.లక్ష రుణమాఫీ విషయంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల కుటుంబాలకు ఇళ్లు నిర్మించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని ఈటల పేర్కొన్నారు. మోదీ హయాంలో దేశంలోని ప్రజలు ఏఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉన్నారన్నారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, పరిమిత, జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, జెడ్పీటీసీ పంజా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరోసారి గెలిపించాలి

రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

నిజాంపేట(మెదక్): బీజేపీని మరోసారి గెలిపించాలని రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి పిలుపునిచ్చారు. సిద్దిపేట నుంచి ప్రారంభమైన విజయ సంకల్ప యాత్ర నిజాంపేటకు చేరుకుంది. మండల నాయకులు, మహిళలు వారికి బోనాలు, గజామాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి బీజేపీకి పట్టంకడితే రామరాజ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకుడు బస్వా లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు వత్తాసు పలకడమా?

వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

తూప్రాన్: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, ఆయనకు మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బాసటగా నిలవడం శోచనీయం అని మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ అన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం నేపథ్యంలో క్యాంపైన్‌లో ఉన్న కౌన్సిలర్ల తరపున ఆయన మాట్లాడుతూ చైర్మన్ అక్రమాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో అక్రమార్కుడికి బీఆర్‌ఎస్ పార్టీ అండదండగా నిలవడం వల్లే తామంతా కాంగ్రెస్ వైపు వెళ్లినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసమే అవినీతి చైర్మన్‌ను గద్దె దించేందుకు అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అక్రమార్కులకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండో వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ చైర్మన్ అరాచకాలకు విసుగు చెంది స్వచ్ఛందంగా తమ వద్దకు వచ్చి అవిశ్వాసానికి మొగ్గు చూపారని చెప్పారు. సోమవారం మీడియా సమావేశానికి బీఆర్‌ఎస్ నేతలు దూరంగా ఉండడం చైర్మన్ అధర్మ పాలనకు చక్కటి నిదర్శనం అన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఇంటర్ నోడల్ విద్యాధికారి సత్యనారాయణ



మెదక్ కలెక్టరేట్: నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదని జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 వరుకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్స్ విద్యార్థులకు జారీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యార్థులు హాల్ టికెట్స్ నెట్ సెంటర్ ద్వారా కూడా పొందవచ్చని తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే హెల్ప్ లైన్ కంట్రోల్ రూమ్ నెంబర్ 96036 15652ను సంప్రదించాలని తెలిపారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడానికి 14416/1800914416557కి కాల్‌చేసి మానసిక నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ పొందవచ్చని పేర్కొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రౌడీ షీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

రామాయంపేట(మెదక్): తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ సూచించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రంజిత్ ఆయన వెంట ఉన్నారు.

అప్రమత్తతే ఆయుధం

ఎస్పీ డాక్టర్ బాలస్వామి



మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే చోరీలను నియంత్రించవచ్చునని జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దొంగతనాలు పెరిగిపోయాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడ్రస్ చెప్పండంటూ దుండగులు ఒంటరి మహిళల వద్దకు వచ్చి మెడలో గొలుసులు లాక్కొని వెళ్లే ప్రయత్నం చేస్తారని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దొంగతనం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..

నేటి నుంచి జిల్లాలో జరిగే ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

అమ్ముడుపోయి అభివృద్ధి గురించి మాట్లాడతారా?

- ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తా
- కౌన్సిలర్‌పై ఎమ్మెల్యే
- మైనంపల్లి ఆగ్రహం
- రసాభాసగా మారిన బల్దియా సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: ''డబ్బులకు అమ్ముడుపోయిన నువ్వా అభివృద్ధిపై ప్రశ్నించేది'' అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. చైర్మన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు అభివృద్ధి జరగడం లేదంటూ ప్రశ్నించడంతో ఎమ్మెల్యే స్పందించి డబ్బులు ఇవ్వకుంటే పార్టీ మారిన నువ్వా ప్రశ్నించేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణం ఉన్నంత వరకు మెదక్ ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. సొంత డబ్బులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, అసత్య ఆరోపణలు చేసేవారిని ప్రజలే తరిమి కొడతారన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే కొందరిని రెచ్చగొట్టి పంపిస్తున్నారని ఆరోపించారు. మెదక్ మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ను వేలం వేయకుండా గతంలో ఉన్నవాళ్లు అడ్డుకుంటే తాను వచ్చాక వేలం వేసి రూ.80వేల ఆదాయాన్ని రూ.5లక్షలకు పెంచానని చెప్పారు. ప్రతినెలా అద్దెలు వసూలు చేస్తున్నా ఆలయ కమిటీ ఎందుకు ఆస్తి పన్నులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. అధికారులు పన్నులు వసూలు చేస్తుంటే.. పాలకులు అడ్డుకుంటే అభివృద్ధి ఎట్లా జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే పనిచేసిందని, తాము మాత్రం ప్రజలకోసం పనిచేస్తామని తెలిపారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పారు.

బల్దియా బడ్జెట్ రూ.50.91 కోట్లు

మున్సిపల్ 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.50,91,50 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవకంగా ఆమోదం తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో ఆస్తిపన్నుల ద్వారా వచ్చే ఆదాయం రూ.5,51కోట్లు, తైబజార్, షాపింగ్ కాంప్లెక్స్, సర్టిఫికెట్స్, యాడ్స్ ఇతర విభాగాల రూ.77,81లక్షలు, శానిటేషన్ ద్వారా రూ.19,69లక్షలు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.2.01,30కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.1,36,70కోట్లు, డిపాజిట్, అడ్వాన్స్‌ల ద్వారా రూ.33లక్షలు, నాన్‌ప్లాన్ గ్రాంట్స్ ద్వారా రూ.3,87కోట్లు, ప్లాంట్ గ్రాండ్ ద్వారా రూ.1.25కోట్లు, ఇతర విభాగాల ద్వారా రూ.35.65కోట్లు మున్సిపల్‌కు ఆదాయం రానున్నట్లు ప్రణాళిక రూపొందించారు. మున్సిపల్ విభాగాల వ్యయం రూ.50,89,50 కోట్లుగా ప్రణాళికలు తయారు చేశారు. మిగులు బడ్జెట్ రూ.2లక్షలుగా అంచనా వేశారు. గత ఏడాది బడ్జెట్ రూ.33కోట్లు కాగా ఈసారి రూ.20కోట్లు పెంచి బడ్జెట్‌ను రూపొందించారు. మెదక్ మున్సిపల్ 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 50,91,50 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులంతా ఆమోదం తెలిపారు.

క్లుప్తంగా

కరాటేలో బాలికల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

కంగ్టి(నారాయణఖేడ్‌): నర్సాపూర్‌లో ఆదివారం జరిగిన అండర్‌–14 విభాగం నేషనల్‌ కుంఫూ కరాటే చాంపియన్‌షిప్‌ పోటీల్లో దెగుల్‌వాడీ యూపీఎస్‌ బాలికలు ప్రతిభ కనబర్చారు. ఆత్మరక్షణ కోసం బాలికలకు తర్ఫీదునిచ్చే పోటీల్లో అపూర్వరెడ్డి గోల్డ్‌ మెడల్‌ సాధించగా, సానియా సిల్వర్‌, అక్షిత, భాగ్యశ్రీ బ్రౌంజ్‌ మెడల్స్‌ సాధించారు. పతకాలు పొందిన వారికి ఎంపీటీసీ సుశీల గోవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ చంద్రమ్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్‌ షేక్మాబేగం రషీద్‌తోపాటు ప్రధానోపాధ్యాయులు శంశొద్దీన్‌ ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, నందిని అభినందించారు.

సైన్స్‌ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్‌: జాతీయ సైన్స్‌ దినోత్సవాన్ని బుధవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో సూచించారు. సైన్స్‌పై ఆసక్తి పెంచే కార్యక్రమాలు జరపాలని, పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు పేరెంట్స్‌ కమిటీ, స్థానికుల సహకారంతో ప్రోత్సాహకాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

చెట్లు నరికించినందుకు కేసు

కొండపాక(గజ్వేల్‌): దేవుడి మాన్యం భూమిలో అక్రమంగా చెట్లను నరికించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు డిప్యూటీ రేంజ్‌ అధికారి లింగమూర్తి తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయం పేరిట పలు సర్వే నంబర్లలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కృష్ణ అనే వ్యక్తికి గ్రామస్తులు కౌలుకు ఇవ్వగా ఎలాంటి అనుమతులు లేకుండా దేవుడి మాన్యం భూమిలో ఉన్న చెట్లను నరికించాడు. విషయాన్ని గ్రామస్తులు ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ బాలకిషన్‌తో కలిసి ఎంక్వైరీ చేసి చెట్లను నరికించిన కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి


మురళి (ఫైల్‌)

మేడ్చల్‌రూరల్‌: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్‌ గ్రామానికి చెందిన మోతెకాని మురళి(36) రెండేళ్ల కిందట మేడ్చల్‌కు వలసొచ్చి చెక్‌ పోస్ట్‌ సమీపంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పిల్లలని తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లింది. ఒక్కడే ఇంట్లో ఉంటున్న మురళి నిత్యం మద్యం సేవించేవాడు. మంగళవారం ఉదయం మురళి చనిపోయాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మేడ్చల్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్‌ ఏసీపీ ప్రసన్నకుమార్‌ అన్నారు. సిద్దిపేట మోడ్రన్‌ బస్టాండ్‌ వద్ద ప్రయాణికులు, వాహనదారులకు ట్రాఫిక్‌, రోడ్డు నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ వినయ్‌సాగర్‌, ఏఎస్‌ఐ ఉమేష్‌ పాల్గొన్నారు.



యువర్‌ అటెన్షన్‌ ప్లీజ్‌

- 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- ఏప్రిల్‌ ఒకటి వరకు దరఖాస్తులు
- ఉమ్మడి మెదక్‌ జిల్లాలో పార్లమెంట్‌ ఎన్నికలకు సిద్ధం
- కళాశాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు

భారత ఎన్నికల సంఘం దేశంలోని అర్హులైన పౌరులందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అంతేకాక ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు వారి బాధ్యతలు గుర్తు చేస్తూ కొత్తగా ఓటర్ల నమోదు, జాబితా సవరణ, గుర్తింపు కార్డుల పంపిణీని నిరంతరం చేపడుతోంది. ఉమ్మడి మెదక్‌ జిల్లాలో రెండు పార్లమెంట్‌ నియోజకవర్గం, పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 25,88,565 ఓటర్లు ఉండగా, అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో, అత్యల్పంగా మెదక్‌ నియోజకవర్గంలో ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి.

యంత్రాంగం సన్నద్ధం..

లోక్‌ సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జహీరాబాద్‌, మెదక్‌ పార్లమెంట్‌ నియోజకవర్గాల్లో అందోల్‌, నారాయణఖేడ్‌, జహీరాబాద్‌, మెదక్‌, నర్సాపూర్‌, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్‌, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ప్రస్తుతం లక్షల్లో ఓటర్లు ఉన్నారు. వచ్చే ఏప్రిల్‌లో లోక్‌ సభకు ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది.

అవగాహన కార్యక్రమాలు..

ఎన్నికల కమిషన్‌ నిబంధనల మేరకు జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని డిగ్రీ కళాశాలల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌ క్రాంతి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అక్కడికక్కడే ఓటు నమోదు నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లోనే కాకుండా గ్రామాల్లోనూ ఏప్రిల్‌ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఉంటారు. బూత్‌ స్థాయి అధికారులు దృష్టి సారిస్తే ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు..

ఫారం 6 ద్వారా నమోదు..

జిల్లాలో ఇప్పటికే పార్లమెంటు ఎన్నికలకు తుది జాబితా ఈ నెల 8న విడుదల చేశారు. ఏప్రిల్‌ 1వ తేదీ నాటికి ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ వయోజనుడిని ఓటరు ఈ జాబితాలో చేర్చుతారు. ప్రస్తుతం విడుదలైన తుది జాబితాకు అదనంగా కొత్త అనుబంధ జాబితాను విడుదల చేస్తారు. ఓటర్‌ జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకోవాలని అధికార యంత్రాంగం ఓటర్లకు సూచించింది. ఫారం 6 ద్వారా నూతన ఓటరు నమోదు చేసుకోవచ్చు. ఆయా పోలింగ్‌ కేంద్రా ఉండే బూత్‌ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) లేదంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఓటు నమోదుకు మరో అవకాశం



పార్లమెంట్‌ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు యువత ఓటు నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్‌ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. లోక్‌ సభ ఎన్నికల్లో పోలింగ్‌ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ శాతం తగ్గిన నేపథ్యంలో ఈసారి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

\- సంగారెడ్డి టౌన్‌



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్‌ క్రాంతి

ఉమ్మడి మెదక్‌ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా

నియోజకర్గం	పురుషులు	మహిళలు
సంగారెడ్డి	1,22,021	1,25,284
పటాన్‌ చెరు	2,09,757	1,97,577
అందోల్‌	1,22,026	1,27,364
నారాయణఖేడ్‌	1,18,064	1,17,498
జహీరాబాద్‌	1,36,569	1,36,391
మెదక్‌	1,03,654	1,13,089
గజ్వేల్‌	1,37,630	1,41,854
సిద్దిపేట	1,16,042	1,20,361
దుబ్బాక	96,867	1,20,369
నర్సాపూర్‌	1,09,806	1,16,342

దొంగల ముఠా అరెస్ట్‌

- వెంచర్లలో విద్యుత్‌ వైర్లు దొంగతనం
- అనంతరం స్క్రాప్‌ దుకాణాల్లో అమ్మకం
- వాహనాలు, రూ.3.32 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ బాలాజీ

కొండపాక(గజ్వేల్‌): విద్యుత్‌ వైర్లను దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్‌ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం తొగుట సీఐ లతీఫ్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కొండాపూర్‌ గ్రామానికి చెందిన గుగులోతు చంద్రశేఖర్‌, కరీంనగర్‌ జిల్లా కేశవపట్నంకు చెందిన ఆగుళ్ల శ్రీనివాస్‌, కరీంనగర్‌ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన కడారి జలేందర్‌ కొన్నేళ్లుగా జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నారు. మొదటగా గగులోతు చంద్రశేఖర్‌ నూతనంగా నిర్మించే ఇళ్లలో కరెంట్‌ ఫిట్టింగ్‌ పనులు చేస్తుండేవాడు. వచ్చే డబ్బులు సరిపోక వెంచర్లలో విద్యుత్‌ వైర్లను దొంగతనం చేసి అమ్ముకునేవాడు. దీనికి స్నేహితులైన ఆగుళ్ల శ్రీనివాస్‌, కడారి జలేందర్‌లను జత చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్‌ రింగ్‌ రోడ్డు వద్ద ఓ వెంచరులో, రింగ్‌ రోడ్‌ వెంబడి ఉన్న స్తంభాలపై విద్యుత్‌ వైర్లు కట్‌ చేసి ప్రజ్ఞాపూర్‌లోని వెంకటేశ్‌ స్క్రాపు దుకాణంలో అమ్ముకునేవారు. అలాగే, కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో ఉన్న రెండు వెంచర్లలో, కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, మేదినీపూర్‌ గ్రామ దారిలోని వెంచర్లలో విద్యుత్‌ వైర్లను ఎత్తుకెళ్లి సిద్దిపేటలో స్క్రాప్‌ దుకాణదారుడు మునీషింగ్‌కు అమ్మేశారు.

పోలీసులను చూసి పారిపోతుండగా..

వరంగల్‌ జిల్లాలోని ఎల్కతుర్తి శివారులోని ఓ వెంచర్‌లో, కరీంనగర్‌ జిల్లా మానకొండూర్‌ శివారులోని ఓ వెంచర్‌లో విద్యుత్‌ వైర్లను ఆటోలో వేసుకొని ప్రజ్ఞాపూర్‌లో విక్రయించడానికి మంగళవారం వెళ్తున్నారు. ఇదే సమయంలో వెలికట్ట క్రాస్‌ రోడ్డు వద్ద ఎస్సై శ్రీనివాస్‌లతోపాటు పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగలు పోలీసులను చూసి ఆటోను మరో దారిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. అనుమానంతో వెంబడించి పట్టుకోగా చేసిన దొంగతనాలు అన్నీ ఒప్పుకున్నారు. ఇప్పటికే ముగ్గురిపై వివిధ జిల్లాలో 7 విద్యుత్‌ వైర్ల దొంగతనాల కేసులు నమోదైనట్లు తెలిసింది. వెంటనే వారిని అరెస్ట్‌ చేసి ఓ టాటా ఏసీ ఆటో, బైక్‌, సుమారు రూ.3.32 లక్షల 1280 కిలోల అల్యూమినియం విద్యుత్‌ వైర్లు, మూడు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ బాలాజీ తెలిపారు. అలాగే విద్యుత్‌ వైర్లను కొనుగోలు చేసిన స్క్రాప్‌ దుకాణదారులు వెంకటేశ్‌, మునీషింగ్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. దొంగలను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన సీఐ లతీఫ్‌, ఎస్సై శ్రీనివాస్‌లతోపాటు పోలీసులు రమణమూర్తి, యాదగిరి, రమేశ్‌, రాజు, కరుణాకర్‌ను ఏసీపీ బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బాలాజీ

గ్రామ చిత్రం.. ముగ్గు రూపం

- సమస్యలు సైతం పటం ద్వారా ప్రదర్శన
- 'భాగస్వామ్య గ్రామీణ అంచనా' కార్యక్రమం

జహీరాబాద్‌: మండలంలోని రంజోల్‌ గ్రామంలో మంగళవారం కొండా లక్ష్మణ్‌ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు 'భాగస్వామ్య గ్రామీణ అంచనా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామ చిత్రపటాన్ని ముగ్గు రూపంలో చిత్రించారు. గ్రామం రూపు రేఖలు, ప్రజలకు ఉపయోగపడే వివిధ శాఖల కార్యాలయాలు, మందిరాలు వేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సైతం ఈ సందర్భంగా పటం ద్వారా గుర్తించి ప్రదర్శించారు. విద్యార్థినులు మూడు నెలల పాటు గ్రామంలో ఉండి వ్యవసాయంలో రైతులు చేపట్టే వివిధ యాజమాన్య పద్ధతులు, సాగు మెలకువలు నేర్చుకోనున్నారు. ఏఈఓ ప్రదీప్‌కుమార్‌ పర్యవేక్షణలో జహీరాబాద్‌ ప్రాంతంలో సాగు చేయబడిన నూతన పంటలైన జరేనియం, చియా, యాపిల్‌ బేర్‌ తదితర పంటలను సందర్శించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, విద్యార్థినులు సజ్జ, పూజిత, సంకీర్తన, సాహితీ, రుచిత, రోషిని, సంతోషి, రైతులు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌ రెడ్డి, మోనేశ్‌, భాస్కర్‌ పాల్గొన్నారు.


గ్రామ రూపు రేఖలను పటం రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భరోసా కేంద్రం సేవలు అభినందనీయం

యూనిసెఫ్‌ ఢిల్లీ బృందం సభ్యులు

సంగారెడ్డి: సంగారెడ్డిలోని భరోసా కేంద్రం సేవలు అభినందనీయమని యూనిసెఫ్‌ ఢిల్లీ బృందం జైరస్‌ లిగూ, డాక్టర్‌ జెలాలెం బి.టాఫెస్సే అన్నారు. మంగళవారం వారు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో భరోసా నోడల్‌ అధికారిగా వ్యవహరించిన అదనపు ఎస్పీ డా.పీ అశోక్‌ జిల్లాలో వివిధ పోలీస్‌ స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో భరోసా సిబ్బంది అందించిన సేవలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వారికి వివరించారు. బాల నేరస్తులు, మైనర్ల కేసులు పోలీసు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సహాయార్థమై 'చైల్డ్‌ ఫ్రెండ్లీ కార్నర్‌' పేరుతో జిల్లాలో మొదటిసారిగా సంగారెడ్డి టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌తో 'చైల్డ్‌ ఫ్రెండ్లీ కార్నర్‌' ప్రారంభించామన్నారు. అనంతరం యూనిసెఫ్‌ బృందం జైరస్‌ లిగూ మాట్లాడుతూ.. అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కిందకి తీసుకురావడం హర్షణీయమని అన్నారు. బాధితులకు అన్ని తానై, కేసు నమోదు మొదలుకొని వారికి న్యాయం జరిగే విధంగా, బాధిత మహిళలకు నష్ట పరిహారం ఇప్పించడం వంటి సేవలు చేయడంపై భరోసా సెంటర్‌ను అభినందించారు. కార్యక్రమంలో యూనిసెఫ్‌ బృందంతోపాటు భరోసా సెంటర్‌ నోడల్‌ అధికారి, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, డాక్టర్‌ జ్యోతి, భరోసా ఇన్‌చార్జి ఎస్‌ఐ.నాగలక్ష్మి, కో–ఆర్డినేటర్‌ దేవలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో యూనిసెఫ్‌ బృందం, పోలీసులు

క్రెడిట్‌ కార్డు లిమిట్‌ పెంచుతామని..

- సైబర్‌ మోసానికి పాల్పడ్డ కేటుగాళ్లు
- రూ.54,563 పోగొట్టుకున్న బాధితులు

సిద్దిపేటకమాన్‌: బ్యాంకు క్రెడిట్‌ కార్డు లిమిట్‌ పెంచుతామని, ఫ్లిప్‌ కార్డు ఓచర్‌ వచ్చిందని మెసేజ్‌లు పంపిస్తూ అమాయక ప్రజల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. కమిషనరేట్‌ పరిధిలో ఇద్దరు బాధితులు గుర్తు తెలియని వ్యక్తులకు రూ.54,563 పంపి మోసపోయారు. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్‌ పోలీసు స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తికి క్రెడిట్‌ కార్డు లిమిట్‌ పెంచుతామని గుర్తు తెలియని వ్యక్తి లింకు పంపించాడు. ఆ లింకును ఓపెన్‌ చేసి తన వివరాలతో పాటు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌ నమోదు చేయగానే తన ఖాతా నుంచి రూ.28,363 డెబిట్‌ అయ్యాయి. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు. అలాగే, ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేసి మీ ఫోన్‌కు ఫ్లిప్‌ కార్డు ఓచర్‌ వచ్చిందని, క్రెడిట్‌ ద్వారా రిలీజ్‌ చేసుకోవచ్చని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు క్రెడిట్‌ కార్డు వివరాలు గుర్తు తెలియని వ్యక్తికి పంపించగానే అతడి ఖాతా నుంచి రూ.26,200 డెబిట్‌ అయినట్లుగా మెసేజ్‌ వచ్చింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేశాడు.

16 మందికి జరిమానా

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్‌ చౌరస్తా, బీజేఆర్‌ చౌరస్తాతోపాటు పలు చోట్ల సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ. 13,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


వెంకటేశం (ఫైల్‌)

మనోహరాబాద్‌(తూప్రాన్‌): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌ మండలం కోనాయపల్లి(పీటీ) గ్రా మానికి చెందిన దుర్గం వెంకటేశ్‌ గౌడ్‌ (48) ఆర్థిక ఇబ్బందులతో కొద్ది రోజులుగా భార్య పద్మతో కలి సి మండలంలోని దండుపల్లిలో అద్దెకుంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు.ఈ క్రమంలోనే మద్యానికి బానిస కావడంతో భార్య తల్లిగారింటికి వెళ్లింది. వెంకటేశ్‌ గౌడ్‌ సోమవారం రాత్రి దండుపల్లి శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. మంగళవారం మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండపాక(గజ్వేల్‌): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లా జిల్లా తంగెళ్లపల్లికి చెందిన పరశురాములు (28) కూలీ పనులు చేసుకుంటూ చిట్టీల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు పెరిగిపోయాయి. సుమారు 4 ఏళ్ల పాటు దుబాయ్‌ వెళ్లి కొన్ని అప్పులు తీర్చగా మరిన్ని మిగిలిపోయాయి. వాటిని తీర్చేమార్గం కానరాక మదనపడుతుండేవాడు. ఈ నెల 23వ తేదీన తిరుపతి వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద దొరికిన ఆధార్‌ కార్డు, ఫోన్‌ నంబర్ల వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు.

గుప్పుమంటున్న గంజాయి

- గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న దందా
- బానిసలవుతున్న యువత
- కరీంనగర్‌ టూ కొండాపూర్‌కు సరఫరా
- పట్టించుకోని అధికారులు


అక్కన్నపేట(హుస్నాబాద్‌): గంజాయి దందా జోరుగా సాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన యువత చిత్తవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నుంచి నేరుగా దూల్మిట్ట మండలంలోని కొండాపూర్‌ గ్రామంలో గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం. అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి అనుకొని ఉంటుంది. దీంతో మండలంలోని రామవరం, గండిపల్లి, కుందనవానిపల్లి, అక్కన్నపేట, కేశనాయక్‌తండా, గౌరవెల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లోని యువత, విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు.

ఒక్క ప్యాకెట్‌ రూ.350 పైనే


గ్రామాల్లో యువత ఎక్కువగా చెరువు కట్టపై, రహస్య ప్రదేశాల్లో సిగరేట్లలో తంబాకును తొలగించి గంజాయి మిశ్రమాన్ని కలిపి తాగుతున్నారు. ఒక గంజాయి ప్యాకెట్‌ సుమారుగా రూ.350 నుంచి రూ.500వరకు లభిస్తున్నట్లు సమాచారం. ఒక ప్యాకెట్‌ ద్వారా మూడు, నాలుగు సిగరెట్లు తాగవచ్చని చెబుతున్నారు. అయితే గంజాయికి అలవాటు పడుతున్న వారిలో యువకులతో పాటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం ఉంటున్నారు. ఒకరిని చూసి ఒకరు అలవాటు చేసుకుంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సాయంత్రం వేళ్లలో గ్రామాల్లో యువకులు గ్రూపులుగా ఏర్పడి గంజాయి సేవిస్తున్నారని సమాచారం.

పండుగ రోజుల్లో జోరుగా....

రామవరం గ్రామంలో సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగలు వచ్చాయంటే చాలు గంజాయి గుప్పుమంటోంది. ఈ గ్రామంలోని యువకులు హైదరాబాద్‌ లాంటి పెద్ద నగరాల్లో ఉంటారు. పండుగలకు గ్రామానికి వచ్చినప్పుడల్లా గంజాయి తాగుతారని పలువురు బాహాటంగానే చెబుతున్నారు. గతంలో బొడిగెపల్లి స్టేజి వద్ద ఇద్దరు యువకులు మత్తులో బ్లేడ్లతో గొంతు కోసుకున్నారు. అలాగే, మండలంలోని అంతక్కపేట గ్రామంలో ఓ ఇంటి ఆవరణంలో గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. గంజాయి నివారణపై పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



సమాచారం ఇవ్వాలి



గంజాయి విక్రయమే కాదు.. వినియోగించినా శిక్షార్హులే. గంజాయిని విక్రయించే వారినే నిఘా పెడుతున్నాం. పల్లెల్లో ఎప్పటికప్పుడూ ఆరా తీస్తున్నాం. గంజాయి గురించి ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలను రహస్యంగా ఉంచుతాం. ఎక్సైజ్‌, పోలీసులకు సహకరించి విక్రయదారుల వివరాలను అందించాలి. ఎవరైనా పట్టుబడితే మాదక ద్రవ్య వినియోగ చట్టం ప్రకారం చర్యలు చేపడుతాం.

–సీహెచ్‌. పవన్‌, ఎక్సైజ్‌ సీఐ, హుస్నాబాద్‌

బంగారం అపహరణ

తూప్రాన్‌: ప్రయాణికురాలి బ్యాగులోని బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐలో నివాసం ఉంటున్న ఉప్పల శ్వేత 26వ తేదీన తూప్రాన్‌లో బంధువుల ఇంటికి ఓ శుభకార్యానికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తిరిగి సొంతింటికి వెళ్లేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాణిగంజ్‌ డిపో బస్సు ఎక్కింది. పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకున్న తర్వాత తన బ్యాగ్‌ తెరిచి చూడగా అందులోని 12.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలు శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలే ఇంటిలో..

శివ్వంపేట(నర్సాపూర్‌): పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి గోమారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి మల్లారెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పని నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. రాత్రి ఇంటికొచ్చిన మల్లారెడ్డి కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి లోనికి వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల నగదు, 11 తులాల బంగారం చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్‌ మృతి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్‌ మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌లోని బీర్‌భమ్‌ జిల్లాలోని కాటగరియా గ్రామానికి చెందిన వసీం అక్రమ్‌ (30) గండి మైసమ్మలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అన్నారంలోని ఎస్‌బీకే ఇటుక బట్టీకి అవసరయ్యే బూడిదను అక్రమ్‌ లారీలో తీసుకొచ్చాడు. లారీలోని బూడిదను అన్‌లోడ్‌ చేసే క్రమంలో లారీపైకి ఎక్కిన అక్రమ్‌ పైన ఉన్న విద్యుత్‌ వైర్లను చూసుకోకపోవడంతో కరెంట్‌ షాక్‌ కొట్టింది. దీంతో అక్రమ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ ముర్తుజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.